ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కొరిటెపాడు: భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ శ్రీహరి అన్నారు. గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వివిధ సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రాంతీయ ప్రతినిధి ఎస్. జవహర్, ఏపీఎస్‌హెచ్ఈ కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహమ్మద్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య వై.గంగాధర్‌రావును వారి కార్యాలయాలలో సత్కరించారు. శారదా హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, విజ్ఞానంద బాలకుటీర్, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్స్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ శ్రీహరి శ్రీనివాస కుమార్, మేజర్ బొమ్మెనా హరిక, రిలేషన్‌షిప్ మేనేజర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

■ జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన గురుపూజోత్సవంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించారు.

■ మారుతీనగర్‌లోని యాపిల్ స్కూల్లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ బి.పేరిరెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్.జ్యోతి, పి. సౌజన్య, షేక్ జానీని సన్మానించారు.

■ అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎన్‌యూ ప్రొఫెసర్ కె.రత్నషీలామణిని కళాశాల గౌరవ చైర్మన్ మన్నవ రాధాకృష్ణమూర్తి, చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ కె.మధుసూదనరావు సత్కరించారు.

■ జేకేసీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, పాలకమండలి సభ్యులు కుప్పస్వామి, కొ్రపాటి రామారావు, డాక్టర్ పి.గోపీచంద్, ఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

■ సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావును కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు పచ్చిపులుసు రాఘవరావు, రామకృష్ణ ప్రభు సత్కరించారు. కార్యక్రమంలో కర్పూరపు సూర్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో జరిగిన వేడుకల్లో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, పీజీ, డిగ్రీ ప్రిన్సిపాల్స్ కె. అనితాదేవి, ఏబీపీ మనోహర్ పాల్గొని అధ్యాపక బృందాన్ని సత్కరించారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సుమేధ హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమైనద తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె. రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువు దైవంతో సమానం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో దైవంతో సమానంగా గురువుకు స్థానం ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ మెయిన్‌రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ సత్యనారాయణ, రెడ్డి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కంజుల సత్యనారాయణ రెడ్డి, ఎస్‌కేబీఎం హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర, ఎన్నార్ఐ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు పిన్నేటి శివ బాబును ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ అధ్యాపక విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువు స్థానాన్ని దైవ సమానంగా మార్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జన్మదినం రోజున గురువులను పూజించుకోవడం ముదావహమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పోలే ముత్యం, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఉద్దగిరి మురళి, సానికొమ్ము జ్యోతి, ఓం ప్రకాష్, బాలకృష్ణ, రాచకొండ ముత్యాలరాజు, బైరెడ్డి, దేవిరెడ్డి సీతారామరెడ్డి, నాగరాజు, పురుషోత్తం, మస్తాన్ వలి పాల్గొన్నారు.

పట్టాభి వ్యాఖ్యలతోనే టీడీపీ కార్యాలయంపై దాడి

గతంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని కించపర్చే విధంగా వ్యాఖ్యలు చేసినందుకే టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి జరిగిందని మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కేసులకు భయపడి వైఎస్సార్ సీపీ నాయకులెవ్వరూ రాష్ట్రం విడిచి వెళ్లిపోనవసరం లేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలెవ్వరు ఆర్థిక నేరాలకు పాల్పడలేదన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి చేశారని నేతల అరెస్టులపై పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించనుందని చెప్పారు.

సెయింట్ జోసఫ్ హైస్కూల్లో వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సిస్సీ ఫ్రాన్సిస్, తెలుగు మీడియం హెచ్‌ఎం ఆర్. శ్రీలక్ష్మి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిస్టర్ సిస్సీ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అత్యుత్తమ ఆలోచనలు గలవారని, మొక్కవలే ఎదుగుతూ విద్యార్థుల మెదళ్లలో నూతన ఆలోచనలు రేకెత్తించగలరని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులం లేని ఏకైక వర్గం గురుకులం

గుంటూరు ఎడ్యుకేషన్: కులం లేని ఏకైక వర్గం గురుకులమని కెనడీ నెక్స్‌జెన్ పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్ బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, అన్నారు. అరండల్‌పేట 2, 3వలైనులోని కెనడీ నెక్స్‌జెన్, కెనడీ ఇంగ్లిషు మీడియం మెరిట్ క్యాంపస్ పాఠశాలలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ బాబు, శ్రీవిద్య మాట్లాడుతూ గురువు స్థానాన్ని దైవ సమానంగా మార్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు. ఆయన జన్మదినోత్సవం గురుపూజోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వసంతలక్ష్మి మాట్లాడుతూ వన్ నేషన్ వన్ స్టూడెంట్ లక్ష్యంగా చేసుకొని గురువులు ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ విపరీత పోకడలతో అడ్డదారులు తొక్కుతున్న నేటి విద్యార్థి లోకానికి మంచి మార్గాన నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న స్వర్ణలతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు సుఫియా, మాధవి, కృష్ణవేణి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు



యాపిల్ స్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పేరిరెడ్డి



కేఎల్పీ స్కూల్లో కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రత్తయ్య, ఉపాధ్యాయులు



హిందూ ఫార్మసీ కళాశాలలో రత్నషీలామణిని సత్కరిస్తున్నయాజమాన్యం



చలమయ్య కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావుకు సత్కారం



కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో ప్రిన్సిపాల్ హేమలతను సత్కరిస్తున్న డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మోదుగుల వేణు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముత్యం తదితరులు

చుట్టూ ఉన్నవారి నుంచే ప్రేరణ పొందాలి

గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ టీటీకే రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: చుట్టూ ఉన్న సామాన్య వ్యక్తులు వారి జీవితాల్లో సాధించిన విజయాలను ప్రేరణగా తీసుకుని, వారి నుంచి స్ఫూర్తిని పొందడం ద్వారా లక్ష్యాలను చేరుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి అన్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలోని జింకానా ఆడిటోరియంలో గురువారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీకే రెడ్డి మాట్లాడుతూ లక్ష్యంపై మక్కువ పెంచుకుని, ఆ దిశగా కృషి చేస్తే విశ్వశక్తి సైతం విజయానికి తోడవుతుందని తెలిపారు. జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. సుధీర్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తాను ఈస్థాయిలో ఉండటానికి కారకులైన గురువులకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా జీజీహెచ్ అభివృద్ధి కోసం ప్రతి యేటా మార్చి ఒకటో తేదీన భాష్యం విద్యాసంస్థల తరపున రూ.రెండు లక్షలు అందిస్తున్నట్లు ప్రకటించారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులతో పాటు భాష్యం మెడెక్స్ అధ్యాపకులను భాష్యం రామకృష్ణ, భాష్యం హనుమంతరావు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబును సత్కరిస్తున్న భాష్యం రామకృష్ణ, టీటీకే రెడ్డి, హరిత

ఉపాధ్యాయులకు సత్కారం

నగరంపాలెం: గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సేవా సంస్థ నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. యోగివేమన విశ్వ విద్యాలయం విశ్రాంత ఉప కులపతి ఆచార్య బేతనభట్ల శ్యామ్‌సుందర్ సభకు అధ్యక్షత వహించారు. అనంతరం డాక్టర్ వెనిశెట్టి సింగారావు, డాక్టర్ యలవర్తి భానుభవాని, డాక్టర్ బీరం సుందరరావులను సత్కరించారు. శ్రీకాజ వెంకటసుబ్రహ్మణ్యం శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు గుళ్ళపల్లి సుబ్బారావు, గుళ్ళపల్లి రాఘవేంద్రరావు, డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు, ఏ.నేహా, జి.శాన్వి పాల్గొన్నారు.



అన్నమయ్య కళావేదికపై ఉపాధ్యాయుడును సత్కరిస్తున్న నిర్వాహకులు

రీజినల్ విజిలెన్స్ అధికారిగా శ్రావణ్‌కుమార్



నగరంపాలెం: గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్‌వీఈఓ)గా డి.సూర్యశ్రావణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు.

వరద బాధితులకు యూటీఎఫ్ విరాళం

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూ.60వేలు విరాళాన్ని అందజేశారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్ శంకరన్‌హాల్లో చెక్కును ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే గళ్లా మాధవి సమక్షంలో డీఈవో పి.శైలజకు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ పాల్గొన్నారు.



డీఈవోకు చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే మాధవి

■ సంగడిగుంటలోని ప్రజ్వల డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వరద బాధితులకు వస్త్రాలు, తాగునీరు, కొవ్వొత్తులు, బ్రెడ్, బిస్కెట్లు పంపించారు. కార్యక్రమంలో పి.గౌరీ శిరీష, సాయికృష్ణ, వినీలా కళ్యాణి, బాలకృష్ణ, శేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

భర్త అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు

నగరంపాలెం: అత్త, భార్యపై ఓ ప్రభుత్వ ఉద్యోగి అయిన భర్త అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డాడు. భర్త చేష్టలపై భార్య ఫిర్యాదుతో నగరంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని ఓ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న భర్తకు భార్యతో వివాదాలు నెలకొన్నాయి. వేధింపులకు కూడా గురిచేసేవాడు. ఈ క్రమంలో నమోదైన కేసులు కోర్టులో విచారణ జరుగుతున్నాయి. మంగళవారం వాయిదా ఉండటంతో ఇద్దరు కోర్టు వద్దకొచ్చారు. అక్కడ వారి మధ్య వాదనలు మళ్లీ జరిగాయి. భార్యను భర్త తీవ్రంగా బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా బుధవారం వింజనంపాడు సమీపంలోని ఓ కళాశాల గోడపై భార్య, అత్త ఫోన్ నంబర్లతో కూడిన చీటిని భర్త రాసి అతికించాడు. శారీరక సంబంధానికి ఆయా ఫోన్ నంబర్లల్లో సంప్రదించాలనేది అందులో సారాంశం. దీంతో భార్య, అత్తకు ఫోన్ కాల్స్ రావడం మొదలయ్యాయి. దీనిపై ఆరాతీయగా, ఫలానా కళాశాల గోడపై శారీరక సంబంధం కోసం ఫోన్ నంబర్లల్లో సంప్రదించాలని రాసినట్లు కాల్స్ చేసిన వారు బదులిచ్చారు. దీంతో అక్కడకెళ్లి చూశారు. అనంతరం దీనిపై భార్య బుధవారం రాత్రి నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె భర్తను పోలీసులు విచారించినట్లు సమాచారం.

మరో ఐదుగురు ఎస్‌ఐలు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో మరో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలు కె.శివప్రసాదరావును తూళ్ళూరు పీఎస్‌కు, ఇ.రమా దేవిని గుంటూరు మహిళా పీఎస్‌కు, తాడికొండ పీఎస్ ఎస్‌ఐ డి.రవీంద్రబాబుని గుంటూరు తూర్పు ట్రాఫిక్ పీఎస్‌కు, ఎస్సీ, ఎస్టీ సెల్– నల్లపాడు పీఎస్‌కు అటాచ్‌మెంట్‌గా ఉన్న ఎస్‌ఐ బి.సాంబశివ నాయక్‌ను గుంటూరు పశ్చిమ ట్రాఫిక్, తెనాలి రూరల్ ఎస్‌హెచ్‌ఓ–1 పీఎస్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావును తెనాలి రూరల్ ఎస్‌హెచ్‌ఓ–2 పీఎస్‌కు బదిలీ చేశారు.

గ్రామాల్లో నిరంతరంగా పారిశుద్ధ్య పనులు

గుంటూరు వెస్ట్: వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని 257 గ్రామ పంచాయతీలకు గాను 27 గ్రామ పంచాయతీలు దారుణంగా దెబ్బతిన్నాయి. మిగిలిన గ్రామాల్లో పాక్షిక నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి కుసుమ శ్రీదేవి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రెయిన్ల పూడిక యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. బ్లీచింగ్, సున్నం, ఫినాయల్ నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ప్రజలకు తగినంత సరఫరా చేయాలని చెప్పారు. ఆర్వో ప్లాంట్‌ల నిర్వహణ, సరఫరా విధానాలు తనిఖీలు నిర్వహించాలన్నారు. పనులకు పూర్తి స్థాయి సిబ్బంది లేకపోతే అవసరం మేరకు నియమించుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ సిబ్బందితో పాటు,ఈఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓలు పనులను పర్యవేక్షించాలని కుసుమ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిరంతరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఆమె చెప్పారు. ప్రజలు కూడా కొన్ని జాగ్రత్తలు చేపడితే అనేక సమస్యల నుంచి బయటపడతారని ఆమె సూచించారు.

శాంతికి, సేవకు ప్రతీక మదర్‌థెరిస్సా

లక్ష్మీపురం: శాంతికి, సేవకు ప్రతీక మదర్‌థెరిస్సా అని సీనియర్ ఇంజనీర్ ఎస్.సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మదర్‌థెరిస్సా వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదాశివం మాట్లాడుతూ మదర్‌థెరిస్సా వర్ధంతి రోజును అంతర్జాతీయ మాతృత్వ దినోత్సవంగా ప్రకటించాలని కోరారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్ మాటలు ఆమెలోని దైవత్వాన్ని సాక్షాత్కరింపజేశాయని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

బజరంగ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక ప్రతిమలు



అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు: పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ గురువారం పిలుపునిచ్చారు. రానున్న వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో చేసిన వినాయక విగ్రహాలు కాకుండా, ప్రతి ఇంట్లోనూ మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించాలన్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించాలంటూ ఉద్యమం చేపట్టామన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పట్టాభిపురం గ్రిన్ గ్రేస్ ఆవరణలో ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా 6వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో మరో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. వినాయకపూజలు నిర్వహించబోయే వారందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రజలందరూ వినాయక చవితి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

తైక్వాండో పోటీలకు స్టెమ్ స్కూల్ విద్యార్థులు ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన స్టెమ్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. విద్యానగర్లోని పాఠశాలలో గురువారం విద్యార్థులు షేక్ సనా, బి. అభిరామ్, సీహెచ్ బాజీ, డి. మానస్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనుపమ, హెచ్‌ఎం రమాదేవి పాల్గొన్నారు.

అభ్యుదయలో ఎకో ఫ్రెండ్లీ గణేష్ వర్క్‌షాప్



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో గురువారం ఎకో ఫ్రెండ్లీ గణేష్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ బి.రోహిణీదేవి మాట్లాడుతూ మట్టి ప్రతిమల్లో ధనియాలు, మెంతులు, బచ్చలి, తోటకూర విత్తనాలను ఉంచి, పూజించిన అనంతరం పాదులు, కుండీల్లో ఉంచడం ద్వారా తిరిగి మొలకెత్తుతాయని అన్నారు. వినాయకుని పూజలో ఉపయోగించే వివిధ రకాల పత్రిని ప్రదర్శించిన విద్యార్థినులు మట్టి వినాయకుని ప్రతిమలను తయారు చేశారు. వీటిని శుక్రవారం సాయంత్రం 4.00 గంటల నుంచి లక్ష్మీపురంలోని రిలయన్స్ ఫ్రెష్, గుజ్జనగుండ్లలోని డీమార్ట్ వద్ద పంపిణీ చేస్తామని తెలిపారు.

నగదు దొంగలించిన పాత నేరస్తుడి అరెస్ట్

నగరంపాలెం: ప్రయాణికుడి జేబులో నగదు దొంగలించిన పాత నేరస్తుడ్ని గురువారం కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేలవారిపాలెం గ్రామానికి చెందిన జె.రాఘవులు, అతని సోదరుడు ఆటోలో బుధవారం గుంటూరు కొత్తపేట వైపు ప్రయాణించారు. ఆటో దిగాక రాఘవులు జేబులోని రూ.30 వేలు కనిపించలేదు. దీంతో బాధితుడు కొత్తపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదుతో సీఐ ఎం.వీరయ్య కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు నగరంపాలెంలోని గుండారావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ పల్లెపాగు అనీల్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం రుజువుకావడంతో అతని అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు.